సాక్షి
వికారాబాద్

శుక్రవారం। 7 । మార్చి। 2025




ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్‌బీఐ వికారాబాద్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ విఠల్ ఖాతాదారులకు సూచించారు. 8లో▸



కంది పంట అగ్నికి ఆహుతి

ఓ రైతు వేసిన కంది పంట అగ్నికి ఆహుతయింది. ఈ ఘటన గురువారం ఫరూఖ్‌నగర్‌లో చోటు చేసుకుంది. 8లో▸



న్యూస్‌రీల్

నేడు ఎల్లమ్మ జాతర



దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ శివారులో వెలిసిన రాంపురం ఎల్లమ్మ జాతర శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సురేశ్ గౌడ్ గురువారం తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు, సాయంత్రం పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం చేస్తారు. జాతరకు హస్నాబాద్, ఆలేడ్, కుదురుమల్ల, పెద్ద నందిగామ, సంగాయిపల్లి తండా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

హెల్త్ అసిస్టెంట్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ పట్టా అందుకుంటున్న హెల్త్ అసిస్టెంట్ శరభలింగం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ క్లస్టర్ హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శరభలింగంకు పర్యావరణ పరిరక్షణ కమిషన్ న్యూఢిల్లీ వారు బుధవారం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కరోనా సమయంలో ప్రజలను చైతన్య పరచడంలో ఆయన చేసిన కృషికి గాను అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సామాజిక కార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్ పట్టా బహూకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే తన బాధ్యతలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. వ్యక్తిగత ఆరోగ్యం పట్ల యువత ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉపవాస దీక్షల కార్డు విడుదల



ఉపవాస దీక్షల పట్టికను విడుదల చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాస దీక్షల సమయ సారిణి పట్టిక కార్డును గురువారం వికారాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త తన్వర్ అలీ, హాషం, సయ్యద్ మతీన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సీజన్‌కు యూరియా కొరత లేదు

కందుకూరు: యాసంగి సీజన్‌కు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరంలేదని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం, ఇతర ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఆయన ఏఓ లావణ్యతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎంత మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మార్చి నెలాఖరు వరకు యూరియా డిమాండ్ ఉన్నందున దానికి అనుగుణంగా నిల్వలను తెప్పించుకోవాలని ఏఓకు సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుని ఎప్పటికప్పుడు నిల్వలను చూసుకోవాలన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు కృషి చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అప్పుడే వారిలో సృజనాత్మకత పెంపొందుతుందని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లి సమీపంలో ఉన్న ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ స్థాయి సాంకేతిక, క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోటీ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం, ఆవిష్కరణలు వెలికితీయటానికి అవకాశం ఉంటుందన్నారు. యువత క్రమశిక్షణతో కూడిన విలువైన విద్యను అభ్యసించాలని తెలిపారు. వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ఆవిష్కరణలు, క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, సెక్రెటరీ నవీన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ నబి పాల్గొన్నారు.

అక్రమాలకు చెక్!

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు

- పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక యాప్
- అర్హుల ముఖ చిత్రాల నమోదు
- ఈ నెల నుంచే అమలులోకి..

వికారాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులు, లబ్ధిదారుల జాబితాను మరింత పారదర్శకంగా అమలు చేయాలని భావిస్తోంది. ప్రత్యేక ఆన్‌లైన్ యాప్‌ను తయారు చేసి, అర్హుల ముఖ చిత్రాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించింది.

అందించేవి ఇవే..

జిల్లాలో 1,106 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 5 ఐసీడీఎస్ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో 56,900 మంది చిన్నారులు, 6,313 గర్భిణులు, 5683 బాలింతలు పేర్లు నమోదు చేసుకున్నారు. ఆయా కేంద్రాలకు వచ్చే నిరుపేద పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం అందజేస్తున్న విషయం తెలిసిందే. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రాథమిక విద్యతో పాటు నెలకు 2.50 కిలోల బాలామృతం సహా రోజుకు ఒక గుడ్డును అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పుతో భోజనం వడ్డిస్తున్నారు. ఆరేళ్ల లోపు పిల్లలకు 50 గ్రాముల బియ్యం , 15 గ్రాముల పప్పుతో భోజనం వడ్డిస్తున్నారు.



తొలి దశలో టీహెచ్ఆర్ లబ్ధిదారులకు..

అంగన్‌వాడీ కేంద్రాలకు రాని వాళ్లకు టీహెచ్ఆర్ (టేక్ హోం రేషన్) అందిస్తున్నారు. మెజార్టీ అంగన్‌వాడీల్లో ఈ సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటికి చెక్ పెట్టి, పారదర్శకతకు పెద్దపీట వేయడంలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. తొలి దశలో టీహెచ్ఆర్ లబ్ధిదారుల ముఖ చిత్రాలు నమోదు చేయాలని నిర్ణయించి, ఈ మేరకు ఈనెల నుంచి అమలు చేస్తోంది. చిన్నారుల తల్లుల ముఖ చిత్రం సహా ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సరుకులు తీసుకున్న వెంటనే ఫోన్‌కు మెసేజ్ వస్తోంది.

ఔటర్‌పై ఘోర ప్రమాదం

- అతివేగంగా వచ్చి ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం



రాములు (ఫైల్)



కారులో రవీందర్‌రెడ్డి మృతదేహం



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రావిర్యాల వండర్‌లా సమీపంలోని ఎగ్జిట్ నంబరు 13 దాటిన అనంతరం 200 మీటర్ల దూరంలో డివైడర్‌పై ఉన్న మొక్కలకు హెచ్ఎండీఏ ట్యాంకర్ ద్వారా కొంగరకలాన్‌కు చెందిన చెనమోని రాములు (55) నీళ్లు పోస్తున్నాడు. ఉప్పల్‌లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై ఘట్‌కేసర్ వద్ద ఔటర్ ఎక్కిన నాగర్‌కర్నూల్ జిల్లా, చిన్నాంబాయి మండలం బెక్కం గ్రామానికి చెందిన కోశిక రవీందర్‌రెడ్డి, బత్తిని కృష్ణారెడ్డి (టీఎస్07జెఎం 1210) కారులో అతివేగంగా వెనుక నుంచి వచ్చి ట్యాంకర్‌తో నీరు పోస్తున్న రాములును ఢీకొట్టారు. దీంతో అతడు గాల్లో ఎగిరి డివైడర్‌పై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు.. ట్యాంకర్ వెనుకభాగం కిందికి దూసుకెళ్లింది. దీంతో ముందు సీట్లో కూర్చున్న కోశిక రవీందర్‌రెడ్డి (50) అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కారు నడుపుతున్న బత్తిని కృష్ణారెడ్డి (45) పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు 120- 140 స్పీడ్‌లో ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ట్యాంకర్ కిందికి దూసుకెళ్లడంతో రవీందర్‌రెడ్డి మృతదేహంతో పాటు కృష్ణారెడ్డిని బయటకు తీసేందుకు పోలీసులు ఎంతో శ్రమించాల్సి వచ్చింది. సీఐ రాఘవేందర్‌రెడ్డితో పాటు ఎస్ఐ వెంకటేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు స్నేహితులు..

రోడ్డు ప్రమాదానికి గురైన కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు. కృష్ణారెడ్డి కొండాపూర్‌లో ఉంటూ స్వీట్ షాప్ నిర్వహిస్తుండగా, రవీందర్‌రెడ్డి బోరబండలో ఉండేవాడు. వీరి మృతితో బెక్కంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూలి కోసం వెళితే..

ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన రాములు ఓ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు.



పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎలుకల సమస్య ఉండొద్దు

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: పాఠశాలలో ఎలుకల సమస్య ఉండరాదని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సిబ్బందికి సూచించారు. మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులను ఎలుకలు కరిచిన విషయమై గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం గురించి ఆరా తీశారు. పిల్లల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, వార్డన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఎలుకలు ఉండడానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటే సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, నాయకులు, పాఠశాల సిబ్బంది నాగిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఖదీర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు రైతు అవగాహన సదస్సు

తాండూరు టౌన్: తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం పలు పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పంటలు పండించే విధి విధానాలపై సరైన అవగాహన లేకపోవడంతో దిగుబడి తగ్గి నష్టపోతున్నారని తెలిపారు. పత్తి, వరి, కంది, కుసుమ, మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుపై శాస్త్రవేత్తలు రైతులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ సదస్సుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి, నాగ్‌పూర్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త గుల్జార్‌భాను హాజరవుతారని తెలిపారు.

ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా రతన్‌సింగ్

తాండూరు రూరల్: తాండూరు డివిజన్ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా రతన్‌సింగ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన శంకర్‌నాయక్ నల్లొండ జిల్లా దేవరకొండకు బదిలీపై వెళ్లారు. దీంతో పెద్దేముల్ ఎంపీఓగా పని చేస్తున్న రతన్‌సింగ్ తాండూరులోని డీఎల్‌పీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను ఎంపీడీఓ విశ్వప్రసాద్ సన్మానించారు.



రతన్‌సింగ్‌ను సన్మానించిన ఎంపీడీఓ

ప్రవీణ్ మృతదేహం అప్పగింత

- పోస్టుమార్టం అనంతరం తానా సభ్యులకు ఇచ్చినట్లు సమాచారం
- ఇండియా పంపేందుకు ఏర్పాట్లు
- మృతుడి తల్లిదండ్రులకు పలువురి పరామర్శ

కేశంపేట: అమెరికాలో మృతి చెందిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతదేహానికి భారతకాలమానం ప్రకారం గురువారం అక్కడి అధికారులు పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతుడి తలలోని బుల్లెట్‌ను తొలగించి, మృతదేహాన్ని తానా సభ్యులకు అప్పగించగా, వారు ఇండియాకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేటీఆర్ పరామర్శ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ప్రవీణ్ తల్లిదండ్రులను ఫోన్‌లో పరామర్శించారు.



కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న గంప రాఘవులు

కేశంపేటలో మృతుడి తల్లిదండ్రులు రాఘవులు, రమాదేవిని కలిసిన ఆ పార్టీ నేతలు ఎల్గనమోని రవీందర్‌యాదవ్, మురళీధర్‌రెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు కేటీఆర్‌తో ఫోన్ మాట్లాడించారు. బాధితులను ఓదార్చిన ఆయన ప్రవీణ్ మృతదేహాన్ని ఇండియాకు తెప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సెక్రటేరియట్ నుంచి వివరాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సెక్రటేరియట్ నుంచి ఫోన్ చేసిన అధికారులు రాఘవులుతో మాట్లాడారు. మృతదేహాన్ని తెప్పించేందుకు ప్రవీణ్ వివరాలతో దరఖాస్తు ఇవ్వాలని కోరారు. దీంతో ప్రవీణ్ కుటుంబ సభ్యులు ఆన్‌లైన్‌లో వివరాలు పంపించారు.

ప్రభుత్వ బడుల మనుగడ ప్రజల చేతుల్లోనే

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లేశం
- ఘనంగా స్వయం పరిపాలన, పాఠశాల వార్షికోత్సవం

బొంరాస్‌పేట: ప్రభుత్వ పాఠశాలలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంచి సౌకర్యాలు ఉన్నాయని, పాఠశాల స్థాయిని పోగొట్టుకోరాదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. గురువారం మండలంలోని ఎన్కేపల్లి ఎంపీ యూపీఎస్‌లో స్వయం పరిపాలన, వార్షికోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల మనుగడ ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. ఎనిమిదో తరగతి వరకు పదేళ్ల క్రితం స్థాయి పెరిగిన పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను, పదో తరగతి వరకు తరగతులను పెంచుకొని ఉన్నత పాఠశాల నిలబెట్టుకోవాలన్నారు. అందుకు రేగడిమైలారం ఆదర్శంగా భావించాలన్నారు. విద్యార్థుల సందేశాత్మక సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

స్వయం పరిపాలనలో ప్రతిభ

స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాలయ్యారు. 16మంది విద్యార్థులు అధికారులు, ఉపాధ్యాయులుగా ఒక్క రోజు విధులు నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. కలెక్టర్‌గా నరేశ్, డీఈఓగా పుష్పలత, ఎంఈఓగా మహేశ్, సీహెచ్ఎంగా మోహన్, హెచ్ఎంగా భవాని, ఉపాధ్యాయులుగా మాధవి, ముబీన, స్నేహశ్రీ, నిశిత్, విరాట్, నందిని, శిరీష, సింధూజ, డ్రాయింగ్ నాని, పీఈటీగా శివసాయి, అటెండర్‌గా శివానంద్ విధులు నిర్వహించారు. వీరికి బహుమతులు అందజేశారు. వడిచర్ల హెచ్ఎం నరేందర్‌గౌడ్, హెచ్ఎం జ్యోతి పరమేశ్వరి, నాయకులు శేఖర్, నర్సింలు, మాణెమ్మ, చంద్రమ్మ, ఉపాధ్యాయులు మహేశ్‌కుమార్, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు శివనీల, సంతోష, అంజిలప్ప పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు

మీర్‌పేట: సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందనవనం వద్ద గురువారం చేపట్టిన విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా పాల్గొన్నారు. ప్రజల నుంచి స్పందన అడిగి తెలుసుకున్నారు. వేలిముద్రల ద్వారా నేరస్తులను గుర్తించేందుకు ఉపయోగించే సాంకేతిక పరికరం పాప్లాన్‌ను ఆయన పరీక్షించారు. అనంతరం నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలు, రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ పనితీరుపై ఆరా తీశారు. సీసీటీవీల నిర్వహణపై సమీక్షించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి, శాంతిభద్రతల నిర్వహణకు చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు సూచించారు.

అద్భుత నగరికి ఆమోదం

ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

- ఏడు మండలాలు.. 56 గ్రామ పంచాయతీలు
- కొత్తగా 90 పోస్టులు సృష్టి
- మంత్రిమండలి ఆమోదం



ఫోర్త్‌సిటీ స్వరూపం ఇలా..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా నాలుగో నగరం ఆవిష్కృతం కాబోతోంది. ఇటు శ్రీశైలం, అటు నాగార్జునసాగర్ జాతీయ రహదారుల మధ్యలో ఉన్న ఏడు మండలాలు.. 56 గ్రామ పంచాయతీలతో సుమారు 30 వేల ఎకరాల్లో 'ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' పేరుతో మరో అద్భుత నగరం ఆవిష్కరణకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ తీర్మానం చేసింది. అంతేకాదు ఇప్పటి వరకు ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ మధ్యలో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను కూడా కొత్త గా ఏర్పాటు చేసే ఎఫ్‌డీసీఏలో విలీనం చేయనున్నట్లు ప్రకటించింది. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి కోసం కొత్తగా 90 పోస్టులను సృష్టించడమే కాకుండా, వాటి భర్తీకి ఆమోదం కూడా తెలిపింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపనతో ఇప్పటికే ఈ ప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆ ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించతలపెట్టిన 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ (రతన్‌టాటా) రోడ్డుకు భూసేకరణ చేపట్టింది. తొలి దశలో 19.2 కిలోమీటర్లకు రూ.1,665 కోట్లు కేటాయించింది. అదే విధంగా రెండో విడతలో 22.30 కిలోమీటర్ల దూరంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు రూ.2,365 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

మహా నగర విస్తరణకు ఓకే

- ఇక ట్రిపుల్ ఆర్ వరకూ హైదరాబాద్
- హెచ్ఎండీఏ పరిధిని పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర పరిధి విస్తరణకు గురువారం మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దీంతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధి రీజినల్ రింగ్ రోడ్డు వరకు పెరగనుంది. ఈ మేరకు గురువారం మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 7 జిల్లాలు, 7,257 చదరపు కిలోమీటర్లు ఉన్న హెచ్ఎండీఏ పరిధి తాజా నిర్ణయంతో సుమారు 11,000 చదరపు కిలోమీటర్ల నుంచి 12,000 చ.కి.మీ వరకు పెరగనుంది. ఇప్పుడు 70 మండలాలు, సుమారు 1000 గ్రామ పంచాయతీలు, మరో 8 కార్పొరేషన్‌లు, 38కి పైగా మున్సిపాలిటీలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. కొత్తగా ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించడంతో మరో 4 జిల్లాల పరిధిలోని 32 మండలాలు చేరనున్నాయి. దీంతో 11 జిల్లాలు, 106 మండలాలు, సుమారు 1400కు పైగా గ్రామాలతో హెచ్ఎండీఏ పరిధి భారీగా పెరగనుంది.

హెచ్ఎండీఏ పరిధి పెరగడంతో ట్రిపుల్ ఆర్ పరిధిలో శాటిలైట్ టౌన్‌షిప్పుల నిర్మాణం జరిగే అవకాశం ఉంది. కొంతకాలంగా స్తబ్దత నెలకొన్న రియల్ ఎస్టేట్ రంగంలో కదలిక వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయ సంస్థలు సైతం భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావచ్చని అంచనా. ఔటర్‌రింగ్‌రోడ్డు వరకు ఉన్న నగరాన్ని కోర్ అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి ట్రిపుల్ ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్‌గా, మిగతా ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణిస్తారు. ఈ మేరకు సెమీ అర్బన్ వరకు సమగ్రమైన మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు వెలుపల మరో 5 కిలోమీటర్ల వరకు హెచ్ఎండీఏ పరిధి పెరగనుంది. ప్రస్తుతం 11 జిల్లాలకు పరిధిని పెంచడం ద్వారా నల్లగొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలు కొత్తగా చేరనున్నాయి.

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


రాజు మృతదేహం

జగద్గిరిగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వరంగల్ కు చెందిన రాజు (40) ఆస్ బెస్టాస్ కాలనీలో ఉంటూ సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన రాజు నెల రోజులుగా పనికి వెళ్లడం లేదు. గురువారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బిర్యానీ సెంటర్‌లో మంటలు


హోటల్‌లో ఎగిసి పడుతున్న మంటలు

షాబాద్: ప్రమాదవశాత్తు ఓ హోటల్‌లో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నర్సింలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన బిర్యానీ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన యజమాని, చుట్టు పక్కల వారు నీరు పోసి మంటలార్పారు. అప్పటికే హోటల్‌లోని సామగ్రి కాలిబూడిదైంది.

హీరో నాగార్జున పరువు నష్టం కేసు వాయిదా

- మంత్రి కొండా సురేఖ, హీరో నాగార్జున గైర్హాజరు
- విచారణ మార్చి 12కు వాయిదా

సిటీ కోర్టులు: రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జునతోపాటు ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడంతో వారి తరుపున న్యాయవాదులు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. సినీ అగ్రహీరో నాగార్జున కుమారుడైన హీరో నాగాచైతన్య-సమంత విడాకుల విషయంపై మంత్రి కొండా సురేఖ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆమె చేసిన వ్యాఖ్యలతో తన కుటుంబ పరువు పోయిందని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. తన కుటుంబంపై అసాధారణమైన వ్యాఖ్యలు చేసినందుకు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో మంత్రి కొండా సురేఖకు కోర్టు నోటీసులు జారీ చేయగా గత విచారణలో ఆమె వ్యక్తిగతంగా హాజరయ్యారు. దీంతో కొండా సురేఖ వ్యక్తిగత బాండ్‌తోపాటు రూ.10 వేలు పూచీకత్తు కోర్టులో దాఖలు చేయాలని కోర్టు సూచించింది. అయితే గురువారం జరిగిన విచారణకు ఆమె హాజరుకాకపోవడమే కాకుండా పూచీకత్తులు కూడా దాఖలు చేయలేదు. వచ్చే వాయిదా లోపు పూచీకత్తులు దాఖలు చేసుకోవాలని కొండ సురేఖ తరుపు న్యాయవాదికి కోర్టు సూచిస్తూ విచారణను వాయిదా వేసింది.

దూరదర్శన్ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ కన్నుమూత

లక్డీకాపూల్ : దూరదర్శన్ మాజీ డైరెక్టర్ దేవళ్ల. బాలకృష్ణ (92) గురువారం కన్నుమూశారు. హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం సంచాలకుడిగా పని చేయక ముందు ఆయన హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆయన మృతి పట్ల ఆకాశవాణి , దూరదర్శన్ కార్యక్రమ సిబ్బంది సంతాపం తెలిపారు. ఆకాశవాణి, దూరదర్శన్ అభివృద్ధికి బాలకృష్ణ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. శుక్రవారం ఉదయం అంబర్‌పేట శ్మశానవాటికలో బాలకృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన బంధువు సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టెన్నిస్ టోర్నీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ)-హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హోటా) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు జేఐసీ సెక్రెటరీ కిలారు రాజేశ్వర రావు తెలిపారు. జాతీయ స్థాయి హోటా, జేఐసీ నేషనల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నగరంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 7 నుంచి 9 వరకు జరగనున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 366 మంది టెన్నిస్ క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10 కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలకు 425 ఎంట్రీలు వచ్చాయన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం


తాండూరు టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్లో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


అనంతగిరి: వికారాబాద్‌లో విద్యార్థులను చెక్ చేసి లోనికి పంపిస్తున్న అధ్యాపకులు


కొడంగల్ రూరల్: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయకుమార్


అనంతగిరి: వికారాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ

తాండూరు టౌన్: ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తాండూరు పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,084 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 18 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1,554 మంది విద్యార్థులకు గాను 1,541 మంది, ఒకేషనల్‌ల్లో 530 మంది విద్యార్థులకు గాను 525 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

అనంతగిరిలో..

అనంతగిరి: ఉదయం నిర్ణీత సమయానికి విద్యార్థులు వారివారి సెంటర్లకు చేరుకున్నారు. అక్కడ అధ్యాపకులు చెక్ చేసి పరీక్ష హాల్లోకి పంపించారు. మొత్తం 6,931మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 6,818మంది హాజరయ్యారు. 113మంది గైర్హాజరయ్యారు. వికారాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ భీంకుమార్ తదితరులు ఉన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రెండు సెంటర్లలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు, ఉర్దూ, హిందీ, సంస్కృతం, అరబిక్ పరీక్షలు నిర్వహించారు. సెంటర్-ఏలో 243మంది విద్యార్థులకు గాను 239మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సెంటర్-బీలో 302మంది విద్యార్థులకు గాను 301మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్షల కేంద్రాలను తహసీల్దార్ విజయకుమార్ పరిశీలించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకనంద కళాశాల, రామలింగేశ్వర కళాశాలలో ద్వితియ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. వివేకనంద కళాశాలలో 180మందికిగాను 10మంది గైర్హాజరుకాగా, రామలింగేశ్వర కళాశాలలో 183మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పల్లె ప్రకృతివనం భూమిపై వివాదం

గోపన్‌పల్లిలో ఘటన

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ అను బంధ గ్రామం గోపన్‌పల్లిలో పల్లె ప్రకృతికి కేటాయించిన భూమిపై వివాదం నెలకొంది. గోపన్‌పల్లిలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 6లో అరఎకరాను గతంలో ప్రకృతి వనానికి కేటాయించారు. కొన్ని సంవత్సరాలుగా ప్రకృతి వనంలో మొక్కలు నాటారు. ఆ తర్వాత నీటి సౌకర్యం లేకపోవడంతో వదిలేశారు. పల్లె ప్రకృతికి కేటాయించిన భూమిలో షబ్బీర్ అనే వ్యక్తి జేసీబీతో చదును చేయిస్తున్నారు. ఈ విషయమై అతన్ని వివరాలు అడగగా తన సొదరి షాహెదబేగానికి సంబంధించిన భూమి అని, గతంలో అధికారులు అడిగితే ఇచ్చారన్నారు. ప్రస్తుతం వాడుకలో లేకపోవడంతో సాగు చేసుకుంటున్నామని షబ్బీర్ బదులిచ్చారు. ఈ విషయంలో గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి సెలవుల్లో ఉన్నారని, సోమవారం క్షేత్రస్థాయిలోకి వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకుంటానన్నారు.

గౌతపూర్‌లో గొర్రెల దొంగతనం

- స్కార్పియో వాహనంలో వచ్చి అపహరించిన దుండగులు
- సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు


గొర్రెలు ఎత్తుకెళ్లినట్లు చెబుతున్న బాధితురాలు జగ్గమ్మ

తాండూరు రూరల్: గొర్రెలను ఎత్తుకెళ్లిన సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..గౌతపూర్ గ్రామానికి చెందిన జెన్నె పెద్ద రాములు గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తుంటాడు. రాత్రి సమయంలో వాటిని ఇంటి పక్కనే ఉన్న దొడ్డిలో ఉంచి గేటుకు తాళం వేసి ఇంట్లో పడుకోవడానికి వెళ్లేవాడు. బుధవారం అర్ధరాత్రి 1 గంటకు గుర్తు తెలియని దుండగులు నల్లా స్కార్పియోలో వచ్చి ఇంటి సమీపంలోని దొడ్డి వద్దకు వెళ్లి గేటు తాళం పగుల గొట్టి 6 గొర్రెలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఇందులో ఓ పొటేలు కూడా ఉందన్నారు. వీటి విలువ రూ.60 వేలలోపు ఉంటుందన్నారు. స్కార్పియోలో వచ్చి గొర్రెలను దొంగిలించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

అదుపు తప్పి ఇన్నోవా కారు బోల్తా


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఇద్దరికి గాయాలు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ సమీపంలో ఇన్నోవా కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన ఆరుగురు వ్యక్తులు మహబూబ్‌నగర్‌లో జరిగే పెళ్లి కోసం గురువారం మధ్యాహ్నం బయలుదేరారు. పర్సాపూర్ సమీపంలో ఓ మలుపు దగ్గర ఇన్నోవా కారు అదుపుతప్పి రోడ్డు కింది భాగంలోకి పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు సలహా మేరకు తాండూర్ ప్రభుత్వాసుపత్రికి పంపించారు.

కంది పంట అగ్నికి ఆహుతి


కంది పంటలో ఎగిసి పడుతున్న మంటలు

షాద్‌నగర్: ఓ రైతు వేసిన కంది పంట అగ్నికి ఆహుతయింది. ఈ ఘటన గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పాపయ్య యాదవ్ తన వ్యవసాయ పొలంలో నాలుగు ఎకరాల్లో కంది పంట వేశాడు. పక్క పొలంలో రైతు పొలాన్ని చదును చేసి వ్యర్థాలకు నిప్పటించాడు. అగ్గి రవ్వలు ఎగిసి పడి కందిపంటకు నిప్పంటుకుంది. గమనించిన రైతులు మంటలార్పేందుకు యత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో పంటమొత్తం అగ్నికి ఆహుతయింది. దీంతో సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

ముద్ర లోన్ పేరిట మోసం

యాచారం: ఇటీవల అపరచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందిస్తూ మోసపోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి రూ.5లక్షల ముద్రలోన్ మంజూరైందని చెప్పిన వెంటనే బాధితుడు అపరిచిత వ్యక్తిన చెప్పిన విధంగా విడతల వారీగా రూ.45,490 పంపించాడు. ఆతరువాత ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి గురువారం యాచారం పోలీసులను ఆశ్రయించాడు. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన రామన్నకు ఈ నెల 4న అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. నీకు రూ.5 లక్షల ముద్రలోన్ మంజూరైందని తాను పంపే స్కానర్‌కు రూ.50వేలు పంపించాలని రామన్న వాట్సాప్‌కు స్కానర్ పంపించాడు. దీంతో విడతల వారీగా రూ.45,490 పంపాడు. ఆ తర్వాత సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే ఎటువంటి స్పందన లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

'చెత్తవేస్తే ఈ-చలాన్'పై అధికారులకు శిక్షణ

సాక్షి,సిటీబ్యూరో: ఎక్కడ పడితే అక్కడ చెత్త, నిర్మాణ.. కూల్చివేతల(సీఅండ్‌డీ) వ్యర్థాలు వేసేవారిని గుర్తించి ఈ-చలాన్ ద్వారా పెనాల్టీలు విధించి, యూపీఐ ద్వారా వసూలు చేసేందుకు సిద్ధమైన జీహెచ్ఎంసీ సంబంధిత ఏఎంఓహెచ్‌లు, డీఈఈలు, ఏసీపీలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ సీఎన్ రఘు ప్రసాద్, ఐటీ విభాగం అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంత్ వారికి శిక్షణ ఇచ్చారు. ఈ-చలాన్ విధించేందుకు టీసీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన విధానాన్ని, యాప్‌ను కాంప్రహెన్సివ్ చలాన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీసీఎంఎస్) యాప్‌గా వ్యవహరిస్తున్నారు. వారితో పాటు యాప్‌ను నిర్వహించే టీజీ ఆన్‌లైన్ ప్రతినిధులు యాప్ ఎలా పనిచేస్తుందో, ఎలా వాడాలో వివరించారు. తొలుత పైలట్‌గా చెత్త డబ్బాల్లో కాకుండా బయట చెత్త వేసే వాణిజ్య ప్రాంతాల్లోని వ్యాపారులు, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నవారు, సీఅండ్‌డీ వేస్ట్ వేస్తున్న వారికి పెనాల్టీలు విధించాలని సూచించారు. సంబంధిత అధికారులు జారీ అయిన చలాన్‌లు, చెల్లింపులు జరిగినవి, పెండింగ్‌లో ఉన్నవి ఎప్పటికప్పుడు చూసుకోవచ్చునన్నారు. చెత్త వేసేవారికి ఎస్ఎంఎస్ వెళ్తుందని, స్వచ్ఛ నిబంధనలు ఉల్లంఘించి వేసిన వ్యర్థాల ఫొటో అక్షాంక్ష, రేఖాంశలతో వస్తుందన్నారు. దేనికి ఎంత పెనాల్టీయో సాఫ్ట్‌వేర్‌లోనే పొందుపరిచి ఉంటుందని వారు వివరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బ్యాంకు సిబ్బంది

ఎస్‌బీఐ వినియోగదారులకు ఉచిత వైద్య శిబిరం

అనంతగిరి: వినియోగదారులు నిత్య జీవితంలో తమ పనుల్లో ఎంత బిజీగా ఉన్నా ఆరోగ్యంపై తప్పకుండా శ్రద్ధ వహించాలని ఎస్‌బీఐ వికారాబాద్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ విఠల్ ఓరుగంటి, ఆర్‌బీఓ (రీజినల్ బిజినెస్ ఆఫీస్) వికారాబాద్ చీఫ్ మేనేజర్ బరుణ్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో మహావీర్ జనరల్ ఆస్పత్రి వైద్యులచే బ్యాంకు వినియోగదారులు సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొదన్నారు. నిత్యం ఉదయం యోగా, వాకింగ్ చేయాలని సూచించారు. నిత్య జీవితంలో ఎంత బిజీగా ఉన్నా ఉదయం ఒక గంట ఆరోగ్యం కోసం కేటాయించాలని సూచించారు. ఎస్‌బీఐ దేశవ్యాప్తంగా తన సేవలను క్షేత్రస్థాయిలో సైతం అందిస్తుందన్నారు. బ్యాంకు సేవలను వినియోగదారులు ఆదరిస్తున్నందునా అతిపెద్ద బ్యాంకుగా సాగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ మేనేజర్ స్వాతి, ఫీల్డ్ ఆఫీసర్లు సంధ్య, జయవర్ధన్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిన ప్రియురాలు...

ప్రేమికుడి ఆత్మహత్యాయత్నం

బిల్డింగ్ మొదటి అంతస్తు ఎక్కి దూకుతానని హల్‌చల్


యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రేమించిన యువతి ఇంటి ముందు ప్రేమికుడు ఆత్మహత్యయత్నం చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు సమాచారం మేరకు... బాగ్‌లింగంపల్లి ప్రాంతానికి చెందిన సోను(21) డిగ్రీ చదువుతున్నాడు. లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ, బృందావన్ కాలనీకి చెందిన అంబిక(21) ఎల్ఎల్‌బీ చదువుతుంది. ఇద్దరు మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ప్రియురాలు ప్రియుడిని కాదనండంతో మనస్తాపానికి గురై గురువారం ప్రియురాలు ఇంటి ముందు ఉన్న మొదటి అంతస్తు పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. ఈ సమయంలో తన వెంట తెచ్చుకున్న బ్లైడ్‌తో కోసుకొని ఫ్లోర్ క్లీనర్ తాగాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే 108కి ఫోన్ చేసి అంబులెన్స్‌లో అతనికి ప్రథమ చికిత్స చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సివిల్‌సప్లై అధికారుల ఆకస్మిక దాడులు

రేషన్ దుకాణం సీజ్

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్ రేషన్ దుకాణంపై గురువారం సివిల్‌సప్లై అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. యాదయ్యగౌడ్ నిర్వహిస్తున్న రేషన్ దుకాణంలో పెద్ద ఎత్తున బియ్యం నిల్వలున్నాయని.. వీటిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాడని పలువురు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన సివిల్‌సప్లై అధికారులు ఆకస్మికంగా దాడి చేసి దుకాణం సీజ్ చేశారు. ఎన్ని క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉందారో శుక్రవారం లెక్కించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ సురేందర్‌ను వివరణ కోరగా సివిల్ సప్లై అధికారుల ఆదేశాల మేరకు రేషన్ దుకాణం వద్దకు ఆర్ఐను పంపామన్నారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

- ఒకరి మృతి
- పది నిమిషాల్లో వస్తానని చెప్పి.. తిరిగిరాని లోకాలకు


నగేష్ (ఫైల్)

చిలకలగూడ: మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ మహ్మద్‌గూడ, శ్రీనివాస నగర్ ప్రాంతాలకు చెందిన పాస్తం నగేష్ (25), నర్సింగ్, శబరి, సాయికిరణ్ స్నేహితులు. నగేష్ శుభకార్యాల్లో బ్యాండ్ వాయించేవాడు. ఈనెల 5న కుటుంబ సభ్యులతో కలిసి మహ్మద్‌గూడలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లిన అతను రాత్రి 9 గంటల ప్రాంతంలో వచ్చాడు. అదే సమయంలో స్నేహితుల నుంచి ఫోన్ రావడంతో పది నిమిషాల్లో వస్తానని చెప్పి బయటికి వెళ్లిన అతను తన స్నేహితులు నగేష్, నర్సింగ్, శబరి, సాయికిరణ్‌తో కలిసి పార్శిగుట్టలోని ఓ వైన్‌షాపు వద్ద మద్యం తాగారు. వైన్ షాపు మూసివేసే సమయంలో మరికొంత మద్యాన్ని కొనుగోలు చేసి మహ్మద్‌గూడలోని ముత్యాలమ్మ ఆలయం వద్దకు వచ్చిన వారు మద్యంతో పాటు గంజాయి సేవించారు. ఈ క్రమంలో పచ్చబొట్టు విషయమై నగేష్, శబరి మధ్య గొడవ జరగడంతో నర్సింగ్ కలుగజేసుకున్నాడు. దీంతో వారు ఒకరినొకరు దూషించుకుంటు గల్లాలు పట్టుకుని ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో నర్సింగ్ చేతికి అందిన కర్రతో నగేష్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో శబరి, సాయికిరణ్ అపస్మారకస్థితిలో పడి ఉన్న నగేష్‌ను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నిందితుడు నర్సింగ్, మృతుడు నగేష్ బంధువులు కావడం గమనార్హం. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నర్సింగ్‌తోపాటు మిత్రులు శబరి, సాయికిరణ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

ఇండియన్ కబడ్డీ ప్లేయర్ మల్లేశ్

మొయినాబాద్‌రూరల్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు స్నేహ బంధాలు పెంపొందుతాయని ఇండియన్ కబడ్డీ ప్లేయర్ గంగాధరి మల్లేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని జేబీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాసంస్థల కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణామాచారి, డైరెక్టర్ సంజయ్, డీన్ క్రటిజ్ఞాన్, స్టూడెంట్ ఎంప్లైర్స్ డాక్టర్ సలావుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

మరో నాలుగు పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు సన్నద్ధం

- ప్రభుత్వానికి ప్రతిపాదించిన పోలీసు ఉన్నతాధికారులు
- వచ్చే బడ్జెట్‌లో మంజూరుకు సన్నాహాలు
- జూన్ వరకు ఏర్పాటుకు రంగం సిద్ధం?


నార్సింగి పోలీస్‌స్టేషన్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రోజురోజుకూ జనాభా పెరిగిపోతోంది. అందుకు అనుగుణంగానే నేరాలు, కేసుల సంఖ్య కూడా పెరుగుతోంది. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏకంగా సంవత్సరానికి దాదాపు 2 వేల కేసులు నమోదు అవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అందులో ఎక్కువగా భార్యాభర్తల తగాదాలతో పాటు ఆర్థిక, సెలబ్రిటీలు, ఐటీ ఉద్యోగుల కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. జనాభాకు అనుగుణంగా ఇప్పటికే నార్సింగి కేంద్రంగా ఏసీపీ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న జన్వాడ, మిర్జాగూడలను కొత్తగా వచ్చిన మోకిల స్టేషన్ పరిధిలోకి మార్చారు. ప్రస్తుత నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో ఒకటి, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని కొంత భాగంతో ఐటీ జోన్ కేంద్రంగా మరో కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది.

- కోకాపేట నియోపోలీస్‌లో శరవేగంగా నిర్మాణాలు, ఐటీ సంస్థలు వస్తుండటంతో జనాభా పెరిగిపోతుంది. అనేక రాష్ట్రాల వారే కాకుండ ఇతర దేశాల వారు సైతం వచ్చి ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. దాంతో కొత్తగా కోకాపేట పేరుతో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.
- పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో ఔటర్ రింగ్ అవతలి ఐటీ జోన్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని ఓ పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. వీటితో పాటు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న బండ్లగూడ పోలీస్‌స్టేషన్, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సులేమాన్‌నగర్ కేంద్రంగా మరో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు.
- దాంతో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కొత్తగా మరో నాలుగు పోలీస్‌స్టేషన్‌లు రాబోయే బడ్జెట్‌లో మంజూరు అయ్యే అవకాశం ఉందని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.
- ఇప్పటికే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా ఉన్న ఔట్‌పోస్టును పూర్తి స్థాయి పోలీస్‌స్టేషన్‌గా ప్రకటించి ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి త్వరలోనే మరిన్ని పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు.

మారనున్న పరిధి...

- నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కోకాపేట, గండిపేట, ఖానాపూర్ గ్రామాలు కొత్తగా వచ్చే కోకాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తేనున్నట్టు సమాచారం. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న వట్టినాగులపల్లి, నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పుప్పాలగూడ ఐటీ జోన్ ప్రాంతంతో కలిపి గౌలిదొడ్డి, సైబరాబాద్ ఐటీ జోన్ పోలీస్‌స్టేషన్ పేరుతో కొత్త స్టేషన్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం అవుతున్నట్టు తెలిసింది. ఇక నార్సింగి, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న కిస్మత్‌పూర్, బండ్లగూడ, హిమాయత్‌సాగర్‌లతో బండ్లగూడ కేంద్రంగా మరో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానుంది.
- అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌లను కలిపి కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు పోలీసు ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. త్వరలోనే కొత్తగా పోలీస్ సిబ్బంది నియామకం చేసేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతుందని, అందుకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.